# రాజకీయ అజ్ఞాని రాహుల్

## బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ బీ టీమ్

- కాంగ్రెస్ అమ్ముడుపోతుంది..
- బీఆర్ఎస్ కొనుగోలు చేస్తుంది
- కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



కాంగ్రెస్ పార్టీ అమ్ముడుపోయే పార్టీ అయితే, బీఆర్ఎస్ కొనుగోలు చేసే పార్టీ అని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఒక రాజకీయ అజ్ఞాని అన్నారు. తెలంగాణ ప్రజలు నివురు గప్పిన నిప్పులా ఉన్నారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని రాహుల్ గాంధీ ఇష్టారీతిన ఆరోపణలు చేస్తున్నారని, అసలు బీఆర్ఎస్‌కు కాంగ్రెస్సే బీటీమ్ అన్నారు. రాహుల్ గాంధీకి అసలు తెలంగాణపై ఏమాత్రం అవగాహన లేదన్నారు. చేవేళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ కు కేఎస్ రత్నం నిన్ననే రాజీనామా చేశారు. శుక్రవారం నాడు హైద్రాబాద్ బీజేపీ కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో కేఎస్ రత్నం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కేఎస్ రత్నానికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రసంగించారు. రాహుల్ గాంధీకి రాజకీయ అవగాహన లేదన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని రాహుల్ గాంధీ చేసిన విమర్శలను ఆయన తోసి పుచ్చారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదవడమే రాహుల్ గాంధీకి అలవాటని ఆయన చెప్పారు. తెలంగాణ సెంటిమెంట్ ఎమిటో, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ఏమిటో , తెలంగాణ చరిత్ర ఏమిటో తెలియని రాజకీయ అజ్ఞాని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ కు బీ టీమ్ కాంగ్రెస్ పార్టీయేనని ఆయన కౌంటరిచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను కంట్రోల్ చేసేది మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ అని ఆరోపించారు. తెలంగాణ ఒక మాఫియా చేతిలో బందీగా ఉందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కుటుంబ, అవినీతి పాలన నుంచి తెలంగాణకు బీజేపీ విముక్తి చేస్తుందన్నారు. బీజేపీపై ఎవరైనా కారుకూతలు కూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ లు అవినీతి పార్టీలన్నారు. ఈ రెండు పార్టీలు నియంతల అడుగుజాడల్లో నడిచే పార్టీలుగా ఆయన విమర్శించారు.



# బీఆర్ఎస్‌కు.. బిగ్ షాక్

- కాంగ్రెస్ గూటికి నీలం మధు
- టికెట్ ఖాయమేనా?
- ఎన్ఎంఆర్ యువసేనలో ఫుల్ ఖుషీ

**ఉమ్మడి మెదక్ బ్యూరో, అక్టోబర్ 27(ప్రభ న్యూస్):** ఉమ్మడి మెదక్ జిల్లాలో కీలక నియోజకవర్గమైన పటాన్‌చెరులో ముఖ్య నేతగా ఎదిగిన ముదిరాజ్ సామాజిక రాష్ట్ర నేత నీలం మధు ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. పటాన్‌చెరు నుంచి బీఆర్ఎస్ టికెట్ తనకే దక్కుతుందని ఆశపడ్డ మధుకు నిరాశే మిగిలింది. దీంతో ఈ నెల 16న గుమ్మడిదల కొత్తపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ సాక్షిగా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. పటాన్ చెరు నియోజకవర్గం నుండి తనకు వెన్నంటి ఉన్న అన్ని సామాజిక వర్గాల ప్రజలు, ఎన్ ఎం ఆర్ యువసేన అభిప్రాయం మేరకు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత నాలుగు రోజులపాటు గుమ్మడిదల మండలం పూర్తిగా పాదయాత్ర చెప్పటి జనం గుండెల్లో చోటు సంపాదించారు.

**ఎనలేని ఆదరణ చూసే..**


బీఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేసి, ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో దిగుతున్నట్లు నీలం మధు ప్రకటించారు. ఆ తర్వాత పాదయాత్ర చేపట్టారు. నీలం మధు ముదిరాజ్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి కాంగ్రెస్ పార్టీ మధును క్యాచ్ చేసుకోవాలని ప్రయత్నాలు మొదలు పెట్టింది. దశల వారీగా చర్చలు జరిపి, పటాన్‌చెరు నియోజకవర్గ అసెంబ్లీ స్థానాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలని నీలం మధును ఆ పార్టీలో చేర్చుకుంది.

**పటాన్ చెరు టికెట్ నీలం మధుకేనా?**

కొన్నేళ్లుగా నీలం మధు ముదిరాజ్ ఎన్ఎంఆర్ యువసేన నెలకొల్పి.. విధి వంచితులతో పాటు అనాథలు, అభాగ్యులు, అన్నా అని ఆయన నమ్మి దగ్గరికి వచ్చిన వారికీ, సహాయం కోరిన ప్రతి మనిషికి తప్పకుండా సహాయం చేసుకుంటూ పోతున్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా.. నేతల జన్మదినాల నాడు, చిట్కుల గ్రామంలో పుట్టిన ప్రతి ఆడబిడ్డకు 5 వేలు బ్యాంక్ లో డిపాజిట్ చేస్తున్నారు. గ్రామ అవసరాల నిమిత్తం సొంత స్థలం విరాళంగా ఇచ్చారు. రాష్ట్రంలోనే ఎత్తైన చాకలి ఐలమ్మ విగ్రాహం ఏర్పాటు చేశారు. తద్వారా రాష్ట్ర స్థాయిలో నీలం మధుకు విపరీతమైన ఆదరణ లభించింది. దీంతోపాటు అగ్రకులాల సపోర్ట్ తో పాటు ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ, బడుగు, బలహీన సామాజికవర్గాల నుంచి ఫుల్ సపోర్టు పుష్కలంగా వచ్చింది నీలం మధుకు వస్తున్న జనాదరణతో కాంగ్రెస్ పార్టీకి విపరీతమైన మైలేజ్ పెరుగుతుందని.. మధుకు టికెట్ కేటాయిస్తే ఈ స్థానంలో కాంగ్రెస్ విజయభేరీ మోగించడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరిశీలకులు భావించినట్లు తెలుస్తోంది. ఫలితంగానే నీలం మధును కాంగ్రెస్ పార్టీలో చేర్పించుకున్నట్లు స్పష్టమవుతోంది. ఆయన అనుచరులు, ఎన్ఎంఆర్ యువసేన, సన్నిహితులు కూడా ఇదే విషయాన్ని తెలియజేస్తున్నారు.

# అమరవీరుల బలిదానం ప్రేరణ కావాలి

## పాసింగ్ పరేడ్ లో అమిత్ షా



**హైదరాబాద్:** వివిధ రకాల వ్యవస్థీకృత నేరాలు సవాళ్లు విసురుతున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. కర్తవ్య నిర్వహణలో అమరవీరుల బలిదానం ప్రేరణ కావాలని చెప్పారు. హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో 75వ బ్యాచ్ ఐపీఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. 175 మంది ట్రైనీ ఐపీఎస్‌లు శిక్షణ పూర్తిచేసుకోవడంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీనికి అమిత్‌షా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ట్రైనీ ఐపీఎస్‌ల నుంచి ఆయన గౌరవవందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ, ''మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు లభించాయి. కర్తవ్య నిర్వహణలో అమరవీరుల బలిదానం ప్రేరణ కావాలి. వివిధ రకాల వ్యవస్థీకృత నేరాలు సవాళ్లు విసురుతున్నాయి. క్రిప్టో కరెన్సీతో దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనానికి యత్నిస్తున్నారు. హవాలా, నకిలీ నోట్ల కట్టడికి మరింత పటిష్ఠంగా పోరాడాలి. ఆంగ్లేయుల కాలం నాటి 3 చట్టాలను మార్చాల్సి ఉంది. సీఆర్‌పీసీ, ఐపీసీ, ఎవిడెన్స్ చట్టాల్లో మార్పులు చేయాల్సి ఉంది. ఈ మూడు చట్టాల్లో కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసి పార్లమెంట్ ముందుంచింది. త్వరలోనే నేర చట్టాల బిల్లు ఆమోదం పొందుతుంది. శాసననాలను సురక్షితంగా ఉంచడమే పాత చట్టాల ఉద్దేశంగా ఉండేది. ప్రజల హక్కులను సురక్షితంగా ఉంచడం కొత్త చట్టాల ఉద్దేశం. కొత్త చట్టాల ఆధారంగా అధికారులు ప్రజలకు రక్షణ కల్పించాలి'' అని అమిత్‌షా పిలుపునిచ్చారు. ట్రైనీ ఐపీఎస్‌ల్లో 14 మందిని తెలుగు రాష్ట్రాలకు కేటాయించారు.

# నువ్వా.. నేనా!

- రాజేంద్రనగర్ లో కాంగ్రెస్ టికెట్ తీవ్రపోటీ
- టికెట్ తనకేనంటున్న నరేందర్
- ఆశలు వదులుకోని జ్ఞానేశ్వర్
- ప్రచారంలో దూసుకుపోతున్న 'హస్తం' నేతలు

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. మొత్తం 11మంది నేతలు దరకాస్తు చేసుకోగా, ఇద్దరి మధ్యలోనే ప్రధానంగా తీవ్రపోటీ ఉంది. గత రెండు పర్యాయాలు పోటీ చేసి పరాభవం పొందిన జ్ఞానేశ్వర్, మరోసారి తన అదృష్టం పరీక్షించుకోవాలని తహతహలాడుతున్నారు. కాగా, అనూహ్యంగా మణికొండ మున్సిపల్ ఛైర్మన్‌కస్తూరినరేందర్‌ముదిరాజ్‌పేరు తెరపైకివచ్చింది. అన్ని ఇంటెలిజెన్స్



సర్వేలు సైతం నరేందర్‌కు జై కొట్టాయి. దీంతో నరేందర్ వైపు అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

**నేడో, రేపో రెండో జాబితా..**

నేడో, రేపో వచ్చే రెండో జాబితాలో తన పేరు ఉంటుందని కస్తూరి నరేందర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు నేతలు పోటీపడి నియోజకవర్గంలో ప్రచారం నిర్వహస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, శాస్త్రీపురం, సులేమాన్ నగర్ డివిజన్లతో పాటు శంషాబాద్, గండిపేట మండలాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. పోటాపోటీగా జరుగుతున్న ప్రచారం కార్యకర్తల్లో జోష్ నింపుతున్నా... ఎవరికి టికెట్ వస్తుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. టికెట్ ఎవరిని వరిస్తుందో అనే అంశంపై నియోజకవర్గ వ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

# సారీ.. అలా కొట్టడం కరెక్ట్ కాదు

- తప్పు నాదే నన్ను క్షమించండి.
- అనుకోకుండా జరిగింది!
- క్షమాపణలు చెప్పిన ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్



రాంలీలా మైదానంలో జరిగిన ఘటనపై కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద స్పందించారు. జరిగిన సంఘటనపై చింతిస్తున్నానని క్షమాపణలు చెప్పారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు తప్పులు ఎత్తి చూపడంలో తప్పులేదని, విపక్షాలు ఏవరైనా ప్రభుత్వాన్ని అడగొచ్చన్నారు. తనపై తీవ్ర పదజాలంతో ఆరోపణ చేయడం తీవ్ర బాధను కలిగిందన్నారు. తన తండ్రి అయిన కేఎం పాండు సర్పంచ్‌గా, మున్సిపల్ ఛైర్మన్‌గా అనేక సేవలు చేసి ప్రజల మన్ననలను పొందారన్నారు. కానీ, వ్యక్తిగతంగా అలాంటి మనిషిని నానా మాటలు అనడంతో సహించలేకపోయానని వెల్లడించారు. ఇష్టమచ్చినట్లు మాట్లాడడం తనను తీవ్రంగా కలిచివేసిందని, దీంతో అసహనంతో అలా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఏదైనా ఉంటే నేరుగా మాట్లాడాలే కానీ వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యులు, ముఖ్యంగా చనిపోయిన వ్యక్తుల పై ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. వారి పైన దుమ్మెత్తి పోయడం మంచి పద్దతి కాదని హితవు పలికారు. ఏదైనా అలా చేయడం తన తప్పేనంటూ మరో సారి క్షమాపణలు ఎమ్మెల్యే వివేకానంద చెప్పారు.



# కమ్మలు అంటే.. అంత లోకువా?

- టికెట్ల కేటాయింపుపై రేణుకా అసంతృప్తి
- దమ్మున్న వారికి టికెట్లు ఇవ్వాలి

కాంగ్రెస్ టికెట్ల కేటాయింపుపై కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి సంచలన వ్యాఖ్యలు చేశారు. టికెట్ల కేటాయింపుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతోన్న కమ్మ నాయకులకు తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. కమ్మ లీడర్లు అంటే అంత లోకువనా? వారిని అంత తక్కువ అంచనా వేస్తున్నారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ల కేటాయింపుల్లో సామాజిక న్యాయం జరగలేదని, బయట నుంచి వచ్చిన వారికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని రేణుకా చౌదరి ఆరోపించారు. మొదటి జాబితాపై ఆమె అసంతృప్తితో ఉన్నారు. డబ్బున్న వాళ్లకు కాదు, దమ్మున్న వారికి టికెట్లు ఇవ్వాలన్నారు రేణుకా చౌదరి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కమ్మలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని.. కమ్మ కులాన్ని గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర, తెలంగాణ రాజకీయ పరిణామాల కారణంగా కమ్మ కులస్తులు ఆగ్రహంగా ఉన్నారన్నారు. కమ్మ కులస్తుల మనోభావాల్ని పరిగణలో తీసుకోవాలని హైకమాండ్‌ను కోరినట్లు రేణుకా తెలిపారు. అయితే ఎన్నికల డేట్ దగ్గరికి వచ్చే కొద్దీ కాంగ్రెస్‌ని వీడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటం.. ఈ నేపథ్యంలోనే రేణుక చౌదరి పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేయటం చర్చనీయాంశం అవుతుంది.

# సూర్యాపేటలో బిజెపి జనగర్జన

**హాజరుకానున్న అమిత్ షా**

ఢిల్లీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూర్యాపేటలో బీజేపీ నిర్వహించబోతున్న జనగర్జన సభలో పాల్గొనబోతున్నారు. తెలంగాణలో ఎన్నికల నేపథ్యంలో అమిత్ షా బిజెపి విజయానికి ప్రత్యేక దృష్టి సారించారు.. దీనిలో భాగంగానే సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొననున్నారు.. ఈ సభ నేటి సాయంత్రం 4 గంటలకు జరగనుంది.. సభ ముగిస అనంతరం అమిత్ షా ఢిల్లీకి పయనం కానున్నారు.



# ఏడు కిలోల బంగారం పట్టివేత

- సంగారెడ్డి జిల్లాలో చెకింగ్
- తనిఖీల్లో పట్టుబడ్డ ఆధారాలు లేని సొత్తు
- లిక్కర్, వెండి, గంజాయి, డ్రగ్స్ పట్టుబడుతున్నాయంటున్న పోలీసులు

తెలంగాణలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో చేసిన తనిఖీల్లో వందల కోట్ల సొత్తు పట్టుబడింది. ఈ తనిఖీల్లో నగదుతో పాటు బంగారం, మద్యం, వెండి, గంజాయి, డ్రగ్స్ పట్టుబడుతున్నాయని పోలీసులు చెబుతున్నారు.

తాజాగా సంగారెడ్డి జిల్లా చిరాగ్ పల్లి అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద పోలీసు తనిఖీల్లో భారీగా బంగారం పట్టుబడింది. తెలంగాణకర్ణాటక బార్డర్ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు తెల్లవారుజామున వాహన తనిఖీలు చేపడుతుండగా... స్కార్పియోలో తరలిస్తున్న ఏడు కేజీల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు బిస్కెట్లు,ఆభరణాల రూపంలో బంగారం తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అక్రమ రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నమన్నారు.బంగారానికి సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగించనున్నట్లు చిరాగ్ పల్లి ఎస్సై నరేష్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..